
● జిల్లా కేంద్రంలో స్పిన్నింగ్ మిల్లు వద్ద నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు








పునాదుల్లోనే.. పనులు!

- జిల్లాకేంద్రంలో నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు
- పట్టణవాసులకు తప్పని ప్రయాణ కష్టాలు
- ప్రధాన సమస్యగా మారిన స్థల సేకరణ
- ఇప్పటికీ గుంట స్థలం సేకరించని వైనం
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కరువు
- సహకరించని సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు
- జిల్లా కలెక్టర్ చొరవ చూపాలంటున్న స్థానికులు



ఆదిలాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మంజూరైన రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్‌బ్రిడ్జి పనులను హడావుడిగా ప్రారంభించినా.. అంతలోనే నిలిపివేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగానే నిలిచిపోవడంతో పట్టణవాసులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకు రావడంతో హడావుడిగా నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ఏడాదిన్నర క్రితమే నిధులు మంజూరైన పనులు మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. మొదట టెండర్ వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తీవ్ర జాప్యం జరిగింది. చివరకు రూ.30 కోట్లతో అంచనాలు పెంచి టెండర్ పిలువడంతో హైదరాబాద్‌కు చెందిన సుబ్రమణ్యం కాంట్రాక్ట్ కంపెనీ రైల్వే బ్రిడ్జి పనులను చేపట్టేందుకు ముందుకు వచ్చింది. తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జితో పాటు స్పిన్నింగ్ మిల్లు వద్ద ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు కాంట్రాక్ట్ కంపెనీతో అగ్రిమెంట్ పూర్తి చేశారు. అనుకున్నట్లుగానే పనులను ప్రారంభించిన ఆటంకాలు ఎదురుకావడంతో అర్ధాంతరంగానే నిలిపివేశారు. దీంతో గతంలో మాదిరిగానే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


గుంట స్థలం సేకరించలే..

రైల్వే బ్రిడ్జిల నిర్మాణం కోసం తాంసి బస్టాండ్, స్పిన్నింగ్ మిల్లు వద్ద స్థల సేకరణ చేసేందుకు అధికారులు గతంలోనే సర్వే పనులను పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు గుంట స్థలాన్ని సేకరించిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో పనులు చేసే పరిస్థితి లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పత్తా లేకుండానే వెళ్లి పోయాడు. తాంసి బస్టాండ్ నుంచి పంజాబ్ చౌక్ వరకు బ్రిడ్జి నిర్మాణం వెడల్పు 12.40 మీటర్లు, బీటీ రోడ్డు వెడల్పు 7.50 మీటర్ల స్థలం అవసరమని అధికారులు గుర్తించారు. అలాగే స్పిన్నింగ్ మిల్లు వద్ద నిర్మించే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కోసం వెడల్పు 11.80 మీటర్లు, బీటీ రోడ్డు నిర్మాణం కోసం 14మీటర్లు అలాగే మట్టి రోడ్డు ఇరువైపుల మురుగు నీటి కాల్వల నిర్మాణం కోసం మరో 7 మీటర్లు స్థల సేకరణ చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే సర్వే చేపట్టి మార్కింగ్ చేసిన ఇప్పటి వరకు నిర్మాణాలను తొలగించే ప్రయత్నం చేయడం లేదు. కనీసం సంబంధిత యజమానులకు ముందస్తు నోటీసులను కూడా జారీ చేయలేదు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం చాలదంటూ కొందరు కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. అలాగే మరికొంత మంది వ్యాపారులు తమకున్న పరిచయాలు, పరపతితో అధికారులపై రాజకీయ పరమైన ఒత్తిళ్లు చేయడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. తాంసి బస్టాండ్ వద్ద నిర్మించే బ్రిడ్జిపైనే అధికంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. స్థల సేకరణలో జాప్యం జరిగితే పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు.



పనులపై తలోమాట

రైల్వే బ్రిడ్జిల నిర్మాణంపై మున్సిపల్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖలు తలో మాట చెప్పడం అయోమయ పరిస్థితులకు దారి తీస్తోంది. ఈ మూడు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతోనే పనులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తుంది. ఇన్నాళ్లు పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ప్రస్తుతం పనులు ప్రారంభమైనా.. స్థానిక సమస్యల పరిష్కారం, స్థల సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆర్అండ్‌బీ శాఖాధికారులు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో ముందుకు వెళ్లాల్సి ఉంది. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరుగడం లేదని తెలుస్తుంది. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా కలెక్టర్ హెచ్చరించినా.. పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదంటున్నారు. రైల్వే శాఖ పనులు పూర్తయ్యేలోపు స్థల సేకరణ పనులు పూర్తయితేనే.. ఇతర పనులను చేపట్టే అవకాశం ఉంటుంది. ఇదే పరిస్థితి మరి కొన్నాళ్ల పాటు ఉంటే మరో ఏడాదైనా పనులు పూర్తయ్యే అవకాశం ఉండదంటున్నారు. ఎన్నికల సమయంలో పనులను ప్రారంభించి కొంత హడావుడి చేసినా.. ఆ తర్వాత బ్రిడ్జి నిర్మాణాల పనులపై పట్టింపే లేకుండా పోయింది. బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడంపై మూడు శాఖల అధికారులు తలో మాట చెప్పడాన్ని చూస్తుంటే శాఖ మధ్య సమన్వయం కరువైందనే చెప్పవచ్చు. ఇకనైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



నిర్మాణ పనులకు స్థల సేకరణ పూర్తి చేయాల్సి ఉంది

: నర్సయ్య, ఈఈ, ఆర్అండ్‌బి ఆదిలాబాద్

జిల్లాకేంద్రంలో చేపట్టిన రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు గాను స్థల సేకరణ పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే సర్వే పనులు పూర్తి చేసి సంబంధిత శాఖలకు వివరాలు ఇవ్వడం జరిగింది. కొంత వరకు పనులు కూడా పూర్తయ్యాయి. పలు వ్యాపార సముదాయ యజమానులకు నోటీసులు ఇస్తాం. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే స్థల సేకరణ పనులను వేగవంతం చేస్తాం. రెవెన్యూ, మున్సిపల్ శాఖల సహకారంతో పనులు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



దేవాపురంలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

సమయపాలన పాటించాలి

తలమడుగు, సెప్టెంబరు 11: రేషన్ డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. బుధవారం మండలంలోని దేవాపూర్, బరంపూర్, ఉమ్మడం, తదితర గ్రామాల్లోని రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ బియ్యాన్ని ఎవరికైనా అక్రమంగా విక్రయించినట్లు తెలిస్తే బాధ్యులపై కఠినచర్యలు తప్పవన్నారు. ఆ తర్వాత గ్రామాల్లో వైద్య శిబిరాలను తనిఖీ చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం రిజిష్టర్‌లను పరిశీలించారు.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయాలి

బోథ్, సెప్టెంబరు 11: గణేష్ నిమజ్జనం ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోథ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దన్నూర్ గ్రామంలో గణేష్ మండలి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

సిరికొండ రూరల్, సెప్టెంబరు 11: ఇందిర మహిళ శక్తి పథకంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉపేందర్ పేర్కొన్నారు. బుదవారం సుంకిడి గ్రామంలో జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మండల మహిళ సమాఖ్య వారి సౌజన్యంతో రూ.50 వేల రుణంతో ఏర్పాటు చేసిన ఇందిర మహిళ శక్తి స్టీల్ బ్యాంకును ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించి ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీపీఎం, ఏపీఎం సంతోష్, సీసీలు లక్ష్మణ్, వీవోఏలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

● సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు : జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ● నాగోబా దర్బార్ హాల్‌లో ఆదివాసీ పెద్దలతో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



సమావేశానికి హాజరైన ఆదివాసీలు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 11: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోబోమని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు ఆధ్వర్యంలో ఎస్పీకి శాలువాతో సత్కరించారు. అనంతరం నాగోబా దర్బార్ హాల్‌లో మండలంలోని ఆదివాసీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ పెద్దల అభిప్రాయాలను సేకరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై దాడి జరగడం బాధాకరమని, ఈ ఘటనపై సమయమానం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని సూచించారు. హత్యాయత్నం, లైంగిక వేధింపుల కేసులో ఇప్పటికే నిందితులను జైనూర్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారని అన్నారు. గాంధీ ఆసుపత్రిలో బాధితురాలికి వైద్య చికిత్స కొనసాగుతోందని, అన్ని చికిత్స ఖర్చులనూ, ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. వదంతులను నమ్మవద్దని, రెచ్చగొట్టే సోషల్ మీడియా పోస్టులను ప్రసారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందని నిజా నిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకోబడుతాయని, కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని,వ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా సార్మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సమన్వయ కర్త సీడాం భీంరావు, ఆలయ పీఠాధిపి మెస్రం వెంకటరావు, వడ్‌గావ్ సార్మేడి మెస్రం చిన్ను, గిన్నేరా సార్మేడి తుంరం జుగదిరావు, బీఈడి కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పూర్క బాపూరావు, ఆర్కా ఖమ్ము, కనక తుకారం, తదితరులు పాల్గొన్నారు.



ఎందాలో విద్యార్థుల ఆహారాన్ని పరిశీలిస్తున్న పీవో ఖుష్బుగుప్త



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తూ..

ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

● సున్నితంగా మదలించిన ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

ఉట్నూర్, సెప్టెంబరు 11: ఉమ్మడి జిల్లాలో ఆధ్వర్యంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ హడలెత్తిస్తున్నారు. ఎప్పుడు ఏ ఆశ్రమ పాఠశాలకు పీవో వస్తారో అని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య, మెను ప్రకారం భోజనాలు అందించడమే తన లక్ష్యం అన్నారు. ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు గిరిజనుల విద్యాభివృద్ధికి కేటాయిస్తున్నందున.. ప్రతీ విద్యార్థికి చదువుతో పాటు సరైన భోజనం అందించేలా చూసుకోవాల్సిన బాధ్యులైన ఉపాధ్యాయులు బాధ్యతారహితంగా ఉండడం సరైనది కాదని అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేట, ఎంద ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించి సిబ్బందిని హెచ్చరించారు. అన్నం మాడిపోకుండా ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతీ విద్యార్థికి కావాల్సిన నాణ్యత గల ఆహారాన్ని అందించడానికి మెనూ ఇవ్వడం జరిగిందని, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎంది ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వండిన అన్నం పరిశీలించారు. అదేవిధంగా లక్కేటిపేట ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న పప్పు పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో ఖుష్బుగుప్తా మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీ రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలల ఆవరణలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా మరమ్మతులు ఉంటే తమకి తెలియజేయాలని అన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.5 కోట్ల విద్యుత్ బకాయిలు

బోథ్, సెప్టెంబరు 11: జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు రూ.5కోట్ల వరకు ఉన్నాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి జేఆర్ చౌహన్ పేర్కొన్నారు. బుధవారం బోథ్‌కు వచ్చిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రూ.5కోట్లు ప్రభుత్వ భవనాలకు సంబంధించినవి ఉండగా.. మున్సిపాలిటీవి రూ.3 కోట్లు, ఆసుపత్రులకు సంబంధించిన మరో రూ.3 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం సర్కారు పాఠశాలలకు విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరిగిందని, అయితే ఐటీడీఏ జిల్లా పరిషత్ పంచాయతీ రాజ్ పాఠశాలకు సంబంధించి రూ.3 కోట్లు అన్నారు. పాత బకాయిల వసూలు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు బకాయిలు చెల్లించాల్సిందేనని పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్, ఎర్రగుట్ట గ్రామాలకు అటవీ అనుమతులు లేకపోవడం వల్ల విద్యుత్ లైన్ ఏర్పాటు కాలేదన్నారు. ఆయన వెంట డీఈఎంఆర్‌టీ ప్రభాకర్ ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

నార్నూర్, సెప్టెంబరు 11: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన నార్నూర్ పోలీసుస్టేషన్ పరిధిలో మం గళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగారెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం జీవగూడ వార్డుకు చెందిన రాజ్బంగే శంకర్(50) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారుడు రాజ్బంగే చందు వయస్సు((18) కొన్ని నెలల నుంచి ఒంటరిగా ఉంటూ ఎవరితో మాట్లాడకుండా నిరాశకు గురయ్యాడు. అప్పుడప్పుడు మద్యం సేవించేవాడు. మంగళవారం రాత్రి దాదాపు 8గంటల సమయంలో పురుగుల మందు తాగినాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వైద్యం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మార్గం మధ్యలో చనిపోయాడు. .

అడవి పందిని ఢీకొని ఒకరి మృతి

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 11: ద్విచక్ర వాహనంకు అడ్డుగా వచ్చిన అడవి పం దిని ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటనబ మెండపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై దుబ్బాక సునీల్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మెం డపల్లి గ్రామానికి చెందిన శిర్సట్ హనుమాన్ (28) ముత్నూర్ గ్రామంలో పాన్‌షాప్ నడిపిస్తూ కుటుబాన్ని పోషిస్తున్నాడు. రాత్రి 9 గంటలకు షాపు బంద్ చేసి సొంత పనులు చేసి రాత్రి 11.30 గంటలకు స్నేహితుడి ద్విచక్రవాహనంతో మెండపల్లి గ్రామానికి వెళు తుండగా మార్గమధ్యలో అడవిపందులను తప్పించపోయి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భీంపూర్ రూరల్, సెప్టెంబరు 11: మద్యానికి బానిసై ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పోలీసులు కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందినర జక్కుల శివ్వన్న(30) అనే వ్యవసాయ కూలీ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలోని దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి తల్లిదండ్రులు భార్య ఉన్నారు. తండ్రి జక్కుల అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భీంపూర్ ఎస్‌ఐ మహ్మద్ ఖలీం తెలిపారు.

నిర్మల్‌లో ఘనంగా గణేశుడి నిమజ్జనోత్సవం

- వేలంపాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న పలువురు భక్తులు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 11 : నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధ వారం రాత్రి గణేషుడి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. భక్తుల నృత్యాలు, కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వాహకులు లడ్డూ వేలంపాటలను పోటాపోటీగా నిర్వహించారు. పట్టణంలోని జేబీ సునందిని అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన లడ్డూ వేలంలో పాల్గొన్న హేమలత నాగారావు దంపతులు 8,100 రూపాయలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అలాగే ఇదే కాలనీలోని పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో సుష్మిత ప్రమోద్‌రావు దంపతులు రూ. 26వేలకు లడ్డును సొంతం చేసుకున్నారు. వీరిని ఆయా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.




నిర్మల్‌లో వేలంపాటలో లడ్డును దక్కించుకున్న భక్తులు


అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రశాంత్ జీవన్‌పాటిల్

అడవులను కాపాడడం అందరి బాధ్యత

● ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి

మావల, సెప్టెంబరు 11: అడవులు కాపాడటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. అటవీ అమరవీరు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మావలలోని హరితవనంలో జిల్లాకు చెందిన అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను సత్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మలవీయ, ఎఫ్ఆర్‌వో గులాబ్ సింగ్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రెసిడెంట్‌ను కలిసిన కంది

ఆదిలాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం ఆదిలాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించి టీపీసీసీ అధ్యక్షుడికి బహుమతిగా ఇస్తామన్నారు. ఆయన సలహాలు, సూచనలు పాటిస్తూ నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికలు ఏవైనా గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నేతలు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సయశక్తుల కృషి చేస్తానన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఉట్నూర్, సెప్టెంబరు 11: మండలంలోని సాలెవాడ(కె) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు జాదవ్ రవికుమార్, ఆయన సతీమణి పీజీహెచ్‌ఎం శీతల్ రవికుమార్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన ఉపాధ్యాయుడి బుధవారం సాలెవాడ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో దంపతులం ఉండడంతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోజ్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీదర్ గౌతమ్, దినేష్, సంగీత, విటల్, శేషురావు, ప్రకాష్, చైతన్యకృష్ణ, చాత్రోపాధ్యాయులు దీపక్, విద్యార్థిని విద్యార్థులు, గ్రామపెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు జాదవ్ రవినాయక్ దంపతులను సన్మానిస్తున్న సాలెవాడ పాఠశాల ఉపాధ్యాయులు


పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకులు


ఇచ్చోడలో నిమజ్జనోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు


మర్లపల్లిలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

పలుచోట్ల వినాయక నిమజ్జనం

● ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాల చివరి ఘట్టం ● నృత్యం చేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 11: పట్టణంలోని ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా సాగింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిమజ్జన శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా ఆకట్టుకుంది. ముందు గా వినాయకుడి నిమజ్జనం సందర్భంగా ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే డప్పు వాయిస్తూ ఆకట్టుకున్నారు. అంతేకాకుండా పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

● రూ.91 వేలు పలికిన వినాయకుడి లడ్డు

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడి శోభాయాత్ర కార్యక్రమంలో భాగంగా లడ్డూ వేలం పాట బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆదిత్య ఖండేష్కర్ వేలం పాటలో పాల్గొని రూ.91 వేల కు లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదిత్య ఖండేష్కర్‌ను శాలువాతో సత్కరించి లడ్డును అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● అయ్యప్ప ఆలయ గణనాథుడికి ఘన వీడ్కోలు

ఇచ్చోడ: అయ్యప్ప ఆలయంలో కొలువుదీరిన ఆదిదేవుడు వినాయకుడి ప్రతిమను ప్రతిష్ఠించిన అయ్యప్ప ఆలయ కమిటీ బృందం, భక్తులు ఐదవ రోజు లంబోధరుడిని చక్కగా ముస్తాబు చేసి గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా డీజేలు, బ్యాండు భాజాలు లేకుండా ప్రత్యేకంగా భజన బృందం సభ్యులను రప్పించి కోలాటాలు, భజన సంకీర్తన, మృదంగం, మేళాతాళాల మధ్య లయబద్ధమైన చప్పుళ్లతో మరాఠా వేషధారణలో చేసిన ప్రత్యేక నృత్యాలు అందరినీ అలరించాయి. నిమజ్జనోత్సవానికి పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు హిందూ, సంస్కృతీ సంప్రాదాయాలు ఉట్టే పడేలా ఊరేగించిన ఆలయ కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. దీంతో అయ్యప్ప ఆలయ వినాయకుడికి ప్రత్యేక పేరు నిలిచిందని ఇలాంటి సంప్రాదాయాలతో గణనాథుడికి వీడ్కోలు పలికితే గ్రామమంతా సస్యశ్యామలంగా ఉంటుం దని, చిన్నారులు చేసిన నృత్యాలు, భజనలను ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగాలని అయ్యప్ప భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, చిన్నారలు, తదితరులు పాల్గొన్నారు.

● సంప్రదాయబద్ధంగా గణేష్ నిమజ్జనం

బోథ్: మండలంలోని మర్లపల్లి గ్రామంలో బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. దీనిలో భాగంగా కాలుష్యాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో గ్రామస్థులు భాజా భజంత్రీలతో వినాయకుడి నిమజ్జనం గావించారు. డీజేలకు దూరంగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్థులు తీసుకున్న నిర్ణయం ఇతర గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలిచింది. నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

ఉట్నూర్: మండలంలోని హస్నాపూర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థులు ఐదు రోజుల పాటు గణేష్ పూజలు నిర్వహించి బుధవారం నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు రాథోడ్‌మంగులాల్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డెన్ చవాన్‌నెహ్రూ, ఉపాధ్యాయులు రజినీకాంత్, సంతోష్, ప్రకాష్, నరేష్ పాల్గొని విఘ్నేశ్వరుని శోభాయాత్రలో విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ విఘ్నేశ్వరుడి నిమజ్జన ఘట్టం పూర్తి చేశారు.


గణనాథుడికి హారతి ఇస్తున్న కలెక్టర్, ఎస్పీలు

గణేషుడికి ఆదిలాబాద్ కలెక్టర్, ఎస్పీ పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని 52 అడుగుల కుమార్‌జనతా గణేషునికి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు కలెక్టర్, ఎస్పీలకు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇందులో పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.


● కుమార్‌జనతా గణేష్ వద్ద కలెక్టర్, ఎస్పీ, సమితి సభ్యులు

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదికల ఏర్పాటు

● నిజామాబాద్ సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్

బోథ్, సెప్టెంబరు 11: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గాను విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలను ఏర్పాటు చేయడం జరుగుతుందని సీజీఆర్‌ఎఫ్ నిజామాబాద్ చైర్‌పర్సన్ ఇ.నారాయణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చోడ సబ్ డివిజన్ పరిధిలోని బజార్హత్నూర్, నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఈ వేదికలో ఆరుగురు మంది తమ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే అందులో నుంచి ముగ్గురు సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించడం జరిగిందని, మరో మూడుంటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అయితే పంట పొలాలలో విద్యుత్‌ను వినియోగించుకునే రైతులు తమ మోటార్ల వద్ద కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో ఏయే ట్రాన్స్‌పార్మర్‌లపై ఎంత విద్యుత్ భారం పడుతుందనేది తెలిసిపోతుందన్నారు. దీంతో తాము డిమాండ్ మేరకు ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేసే వీలుంటుందని పేర్కొన్నారు. కరెంట్ హెచ్చు తగ్గులలో మార్పుల కోసం చర్యలు తీసుకుంటామని వివరించారు. విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయం సమస్యలపైన వేదికలో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

అదేవిధంగా విద్యుత్ మీటర్లు కాలిపోవడం.. ఎక్కువగా రీడింగ్ రావడం, బిల్లులు ఎక్కువ రావడం వంటి సమస్యలను ఈ వేదికలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సభ్యులు ఎస్.రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యులు ఎల్.కిషన్, ఇండిపెండెంట్ సభ్యులు ఎం.రాజాగౌడ్, నాలుగు మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లూరి

● ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ

ఆదిలాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లూరి అశోక్‌రెడ్డిని నియమిస్తూ ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పాత కమిటీ రద్దు కావడంతో చాలా రోజులుగా ఈ నామినేటెడ్ పదవి కోసం ఆశావాహులు తీవ్రంగా పోటీపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన పెద్దల వద్ద తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించిన అల్లూరి అశోక్‌రెడ్డిని ఆ పదవి వరించింది. కష్టపడి పని చేసే వారికి తప్పకుండా సముచిత స్థానం దక్కుతుందన్నారు. ఎంతో కాలంగా పార్టీ కోసం పని చేస్తున్న అశోక్‌రెడ్డికే ఆ పదవి ఖాయమైంది. వైస్ చైర్మన్‌గా సావాపూర్ విలాస్, సభ్యులుగా బాస సంతోష్, నిమ్మల ప్రభాకర్, సాదలి రామన్న, నరకట్ల స్వామి, మడావి చంద్రకాంత్, గౌర్కర్ సీతారాం, తుడుం రాములు,షేక్ మహమూద్, దూమల ఆశక్క, యెల్మ రాంరెడ్డి, విక్రాంత్‌కుమార్ కేతన్, తునికి వార్ రాజన్నల పేర్లు ఖరారయ్యాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

భోసి వినాయకుని దర్శనానికి బారులు తీరిన భక్తులు


హారతి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

తానూర్, సెప్టెంబరు 11 : మండలంలోని భోసి గ్రామంలో కొలువుదీరిన వరసిద్ధి వినాయకుని దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. తానూర్ మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా, పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. వినాయకుడికి నిర్వహించే మహాహారతిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. మహిళలు అత్యధికంగా పాల్గొనడంతో ఆలయం జనసంద్రం అవుతుంది. భక్తులు తమ కోరికలు నెరవేరుతుండడంతో తండోపతండాలు వస్తున్నారని, గతేడాది 123 మంది భక్తులు సంతాన ఫలాలు తీసుకోగా 73 మంది భక్తులు సంతానం కలిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హారతి తరువాత నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. బుధవారం మండలంలోని బామ్ని గ్రామానికి చెందిన వడ్ల అశోక్ భక్తి పాటల కార్యక్రమం నిర్వహించగా భక్తులను అలరించింది.ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది 13వ తేదిన సంతాన ఫలాల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

లోకేశ్వరం రూరల్, సెప్టెంబరు 11 : రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలి మెడలో నుండి బంగారు గొలుసు గుర్తు తెలియని దుండగులు తెంచుకొని వెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన అల్లం గంగవ్వ అనే వృద్ధురాలు సోమవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామం బటయకు వెళ్లగా వెనుక నుండి వచ్చిన ఆగంతకుడు ఆమె మెడలో గల దాదాపు 20 గ్రాముల బంగారం గొలుసును తెంచుకొని వెళ్లినట్లు తెలిపారు. ఊహించని ఘటనకు షాక్‌కు గురైన ఆమె తేరుకొని కేకలు వేసినా ఫలితం లేకపోయింది. బంగారం విలువ దాదాపు రూ. 1,40,000ల వరకు ఉంటుందని సమాచారం. ఈ సంఘటనతో ఆ గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డి సారథ్యంలో విద్యారంగానికి పెద్దపీట

భైంసా, సెప్టెంబరు 11 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని ఎన్‌ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా ప్రతినిధి షేక్ అంజాద్ అన్నారు. బుధవారం భైంసా పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల్లో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. విద్యా వ్యవస్థను పూర్తి స్థాయిలో మెరుగుపరచేందుకు రాష్ట కాంగ్రెస్ సర్కార్ ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టే దిశగా అడుగులు వేసిందన్నారు. ఇందులో భాగంగానే ఐఏఎస్ అధికారి అకునూరి మురళి నేతృత్వంలో విద్యా కమీషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంబంధిత కమీషన్ గత ప్రభుత్వ అనుసరించిన లోపభూయిష్టమైన విధానాలు, నిర్లక్ష్యపూరిత వైఖరుల మూలంగా విద్యా సంస్థల్లో మూలనపడిన విద్యా ప్రమాణాల మెరుగుదలకు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాడనుందన్నారు.

ఘనంగా వినోబాభావే జయంతి

కుంటాల, సెప్టెంబరు, 11: మండల కేంద్రమైన కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో బుధవారం స్వాతంత్ర సమరయోధుడు వినోబాభావే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ప్రిన్సిపల్ సంతోష్ మాట్లాడుతూ సహాయ నిరాకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారని ముఖ్యంగా విదేశీ దిగుమతులకు బదులుగా స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని పిలుపునిచ్చారన్నారు.

ముథోల్ డివిజన్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

● భజనలు.. నృత్యాలతో శోభాయాత్ర ● గ్రామ చెరువుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

ఖానాపూర్, సెప్టెంబరు 11 : మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మధ్యాహ్నం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వ హించి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక భూక్యాజాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయం నుంచి పట్టణ శివారులోని గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నదీతీరంలో పూజలు నిర్వహించి ఉత్తర వాహినిలో వినాయకుడి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజగంగన్న, పట్టణ అధ్యక్షుడు గౌరీకర్‌రాజు, పెంబి మండల అధ్యక్షుడు సల్ల నరేందర్‌రెడ్డి, ఖానాపూర్ మాజీ వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, రైతు బంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్ కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు తోట సుమిత్, మాజీ సర్పం చ్‌లు పార్శపు శ్రీనివాస్, కే. గోపాల్, స్థానిక నాయకులు తదితరులు న్నారు.


జాన్సన్‌నాయక్ నివాసంలోని వినాయక మండపంలో పూజలు


కుభీర్ : మండలంలోని పార్డి(కే), జాంగాన్, కస్రా గ్రామాల్లో బుధవారం వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఆయా మండపాల నిర్వాహకుల ద్వారా 5రోజులుగా పూజలందుకున్న గణపయ్యలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో ఉంచి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం గ్రామసమీపంలోని చెరువుల్లో, వాగుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ముథోల్ : మండలంలోని తరోడా, వెంకటాపూర్, విట్టోలి, విట్టోలి తండా, రాజుతండా, కారేగాం, ఆష్ట, మచ్కల్, తదితర గ్రామాల్లో బుధవారం గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో వినాయకుడిని పూజించారు. సుందరంగా తయారు చేసిన ప్రత్యేక వాహనాలలో బొజ్జ గణపయ్యలను ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో కోలాటలు ఆడుతూ నృత్యాలు చేస్తూ ఘనంగా శోభాయాత్రను నిర్వహించారు. తదనంతరం ఆయా గ్రామాల్లోని చెరువుల్లో వినాయకులను నిమజ్జనం చేస్తారు. మండలంలోని తరోడాలో శోభాయాత్రలో వినాయకుడికి ముథోల్ ఎస్సై సాయికిరణ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎస్సైని ఘనంగా సన్మానించారు. ఆయా గ్రామాల్లో మండల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును చేపట్టారు.

కుంటాల : కుంటాల మండలంలోని కల్లూర్ వాసవి కళాశాల, అంబకంటి, విట్టాపూర్, తదితర గ్రామాలలో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదు రోజుల నుంచి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పలు గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు తదితరులు ప్రత్యేక వాహనంలో వినాయకుని ఉంచి ప్రధాన వీధుల గుండా భాజా భజంత్రీలతో యువత నృత్యాలు కేరింతల మధ్య సమీప చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై భాస్కరాచారి బందోబస్తు ఏర్పాటు చేశారు.

లక్ష్మణచాంద : మండలంలోని ఆయా గ్రామాల్లో గల వినాయక మండపాల వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణచాంద, మునిపెల్లి, చామన్‌పెల్లి, వడ్యాల్, కనకాపూర్, బాబాపూర్, మల్లాపూర్, మాచాపూర్, పొట్టపెల్లి, రాచాపూర్, పార్‌పెల్లి, పీచర, ధర్మారం, నర్సా ఫూర్(డబ్ల్యూ), తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


తరోడాలో వినాయకుడికి పూజలు చేస్తున్న ముథోల్ ఎస్సై


శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

ఉద్యోగులు నిత్య విద్యార్థులుగా మారాలి


వ్యవసాయ అధికారులకు సర్టిఫికెట్ అందిస్తున్న అంజిప్రసాద్

పెంబి, సెప్టెంబరు 11 : ఉద్యోగులు తమ వృత్తి జీవితంలో నిత్య విద్యార్థులుగా మారాలని, కాలంతో పోటీ పడుతూ మారుతున్న సమయంతో పాటుగా అందివస్తున్న నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందింపుచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. పెంబి మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా పని చేస్తున్న రాజ్‌కుమార్, కుంటాల మండల విస్తరణ అధికారి పవన్‌లు ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్మెంట్ కళాశాల (మేనేజ్) నుండి వ్యవసాయ విస్తరణ విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సును పూర్తి చేసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వ్యవసాయ విస్తరణ అధికారులకు జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... ఉద్యోగులు తమ వృత్తి జీవితంలో నిత్య విద్యార్థులుగా మారాలని, కాలంతో పోటీ పడుతూ మారుతున్న సమయంతో పాటుగా అందివస్తున్న నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందింపుచుకోవాలని సూచించారు. గతంలో ఈ ఇరువురు విస్తరణ అధికారులు తాము పనిచేసిన మండలాల్లోని గిరిజన ప్రజల ఆదాయాన్ని పెంచే ఉద్దేశ్యంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, హైదరాబాద్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో తేనెటీగల పెంపకానికి సంబంధించిన కోర్సును కూడా పూర్తి చేసుకుని వచ్చారని ప్రతి ఒక్క ఉద్యోగి కూడా ప్రజాసేవలో అంకితం అవ్వాలన్నారు.



ఎంజేపీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

ఖానాపూర్, సెప్టెంబరు 11 : ఖానాపూర్‌లోని మహాత్మజ్యోతి బాపూలే బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశ్వేశ్వర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరంలో 20 సీట్లు, సీఈసీ మొదటి సంవత్సరంలో 16 సీట్లు, ఎంపీసీ మొదటి సంవత్సరంలో నాలుగు సీట్లను భర్తీ చేయుటకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రూపులలో చేరాలనుకునే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు మూడు జతల జిరాక్స్ ప్రతులతో కళాశాలకు హాజరై ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

జోరుగా క్రిప్టో దందా





ప్రస్తుతం చెలామణిలో ఉన్న యూబిట్ కాయిన్ యాప్.. మెటామాస్క్





- జిల్లా విచ్చలవిడిగా బ్లాక్‌చైన్ లావాదేవీలు
- అన్ని దందాలపై ప్రభావం చూపుతున్న 'క్రిప్టో'
- కుదేలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- రియల్టర్లతో పాటు లబోదిబో మంటున్న సామాన్యులు
- ఉన్న ప్లాట్లు అమ్ముకుందామంటే కొలుగోలు దారుల కరువు
- అధిక లాభాలకు ఆశపడి ఆన్‌లైన్ కరెన్సీలోనే రూ. లక్షల్లో పెట్టుబడులు
- అరెస్టులు జరుగుతున్నా అమాయకులకు ఎరవేసేందుకు మాత్రం ముమ్మరంగా యత్నాలు
- కాయిన్ ధర తగ్గుతోందని ప్రచారం చేస్తూ తక్కువ ధరకే కొనుగోళ్లు

ఖానాపూర్, సెప్టెంబరు 11 : ప్రస్తుతం పట్టణం నుంచి మారుమూల ప్రాంతాల్లోని పల్లెల వరకు జిల్లాలో ఏ నలుగురు కలిసిన జరుగుతున్న చర్చ ఒక్కటే... ఆన్‌లైన్ బిజినెస్‌లో నువ్వు ఎంత పెట్టుబడి పెట్టావు... నేను ఇంత పెట్టుబడి పెట్టాను... నాకు ఇంత లాభం వచ్చింది. నువ్వు కూడా పెట్టుబడి పెట్టు... నీకు లాభం వస్తుంది.. ఇలా ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టినవారు ఎదుటి వారిని ప్రభావితం చేసేందుకు పనిగట్టుకుని మరీ ప్రచారం చేస్తున్నారు. క్రిప్టోకరెన్సీ, యూబిట్ కాయిన్, మెటా మాస్క్, మెటా ఫండ్ యూనిటీ మెటా, వీసీఐ, పీఎస్‌ఏ లాంటి బ్లాక్ చైన్ దందాలు నేడు మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ మోసపూరిత దందాలలో పెట్టుబడులు పెడితే తక్కువకాలంలోనే ఎక్కువ లాభాలు గడించవచ్చనే కేటుగాళ్ల మాటలతో నిత్యం ఎంతో మంది సామాన్యులు ఈ మోసపూరిత దందాల వైపు ఆకర్షితులవుతున్నారు. తాము లక్షల్లో పెట్టుబడులు పెడితే తమకు కొద్దినెలల వ్యవధిలోనే మూడింతల లాభాలు వస్తున్నాయని నమ్మబలుకుతుండడంతో ఈ దందాలో పెట్టుబడులు పెట్టి తమకున్న ఇబ్బందుల నుంచి బయటపడాలని పలువురు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అత్యాశతో తమ వద్ద డబ్బులు లేకున్నా అప్పులు చేసి మరి ఈ ఆన్‌లైన్ దందాలలో పెట్టుబడులు పెట్టి మోసపోయాక చేసేదేమీ లేక ఎవరికీ చెప్పుకోలేక తమను తామే నిందించుకుంటూ పలువురు మదన పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ బ్లాక్‌చైన్ దందాతో మార్కెట్‌లో ప్రస్తుతం ద్రవ్యం కొరత ఏర్పడి.. లావాదేవీలు తగ్గుముఖం పట్టాయని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులతో పాటు సామాన్యులు సైతం ఈ ఆన్‌లైన్ వ్యాపారం వైపు మొగ్గు చూపుతుండడంతో ఎవరి వద్ద నగదు లేకుండా పోతుందని ,ెబుతున్నారు. ఈ ఆన్‌లైన్ వ్యాపారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఇతర దందాలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

అన్ని దందాలపై ప్రభావం

ప్రస్తుతం మార్కెట్‌లో సాగుతున్న ఆన్‌లైన్ పెట్టుబడుల దందా వ్యవహారంతో పరోక్షంగా అన్ని వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడినట్లు చెబుతున్నారు. ఇటీవల వీసీఐ, పీఎస్‌ఏ లాంటి కొన్ని ఆన్‌లైన్ యాప్‌లలో పలువురు లక్షల రూపాయలలో పెట్టుబడులు పెట్టినట్లు చెబుతున్నారు. రాఖీపౌర్ణమి సందర్భంగా ఆఫర్ ఇస్తున్నట్లు ప్రకటించిన వీసీఐ అనే యాప్ తన వద్ద రూ.96,000 పెట్టుబడి పెడితే 30 రోజుల్లో రూ.8.5 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని నిత్యం రూ.28 వేలకు పైగా బ్యాంకుఖాతాలలో జమ చేస్తామని తన వెబ్ సైట్‌లో ఈ యాప్ తయారు చేసిన సైబర్ నేరగాళ్లు ప్రకటించారు. దీంతో అత్యాశకు పోయిన పలువురు ఒక్కొక్కరు రెండేసి ప్రొడక్ట్‌లను కొనుగోలు చేస్తూ లక్షల రూపాయల్లో పెట్టుబడులు పెట్టారు. ఇలా పెట్టుబడులు పెట్టిన రెండు మూడురోజుల్లోనే ఈ యాప్ తన అసలురంగును బయటపెట్టింది. ఒక్కసారిగా వీసీఐ బోర్డు తిప్పిడంతో జిల్లాలో సుమారు రూ. వందకోట్లకు పైగా నష్టం జరిగినట్లు చెబుతున్నారు. వీసీఐ కంటే ముందే పీఎస్‌ఏ అనే యాప్ అందినకాడికి దండుకొని బోర్డు తిప్పేసిందని చెబుతున్నారు. ఇలా ఆన్‌లైన్ యాప్‌ల మోజులో పడి లక్షల రూపాయలను పోగొట్టుకున్న వ్యక్తులు మార్కెట్‌లో ప్రస్తుతం ఎటువంటి లావాదేవీలు జరపకుండా స్తబ్దుగా ఉన్నట్లు చెబుతున్నారు. వీరి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆ ప్రభావం ఇతర వ్యాపారాలపై పడుతున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

కుదేలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం

బిట్‌కాయిన్ దందా ప్రారంభమైన నాటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందని పలువురు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టి తమ భవిష్యత్తు అవసరాలకు భరోసాగా భూములు కొనుగోలు చేసే వ్యాపారులంతా తాజాగా ఈ ఆన్‌లైన్ వ్యాపారం వైపు మళ్లీనట్లు తెలుస్తోంది.

ఈ ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టడమే కాకుండా బ్లాక్‌చైన్ పద్ధతిన తమ కింద పలువురితో పెట్టుబడులు పెట్టించి వారి ద్వారా వచ్చే కమిషన్ల నుంచి కోట్ల రూపాయలను దండుకుంటూ కొంతమంది స్టార్ రేటింగ్‌లను పొందుతున్నట్లు చెబుతున్నారు. ఇలా స్టార్‌రేటింగ్‌లు పొందిన పలువురు స్టార్లు సామాన్యులను సైతం ఈ ఆన్‌లైన్ దందాల వైపు ఆకర్షితులను చేస్తున్నట్లు చెబుతున్నారు. మారుమూల గ్రామాల్లో ఉండే పలువురు చిరు వ్యాపారులు, చిన్న సన్నకారు రైతులు రూపాయి రూపాయి పోగేసుకొని పట్టణ ప్రాంతాల్లో ప్లాట్లను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఈ యూబిట్ కాయిన్ స్టార్‌లంతా ప్లాట్ల కొనుగోలు కంటే కాయిన్‌లో పెట్టుబడే కలిసొస్తుందని నమ్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పెంబి మండలంలోని ఓ గ్రామంలో యూబిట్ కాయిన్ స్టార్లు ఓ సమావేశం సైతం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఇలా స్టార్లు చేస్తున్న ప్రచారంతో స్థిరాస్తి కొనుగోళ్ల ఆలోచన నుంచి బిట్‌కాయిన్ కొనుగోలు వైపు పలువురు వెళ్తుండడంతో రియల్ ఎస్టేట్ రంగం మరింత కుప్పకూలినట్లుగా చెబుతున్నారు. కరోనా ప్రారంభమైన నాటి నుంచి 'మూలిగే నక్కలా' సాగుతున్న రియల్ ఎస్టేట్ దందాపై ఈ బిట్ కాయిన్ 'తాటికాయ పడినట్లుగా' పడిందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవసరానికి అప్పు పుట్టని పరిస్థితి

సామాన్యుల ఇంట్లో ఏదైనా శుభకార్యం పెట్టుకుంటే అవసరానికి మార్కెట్‌లో కనీసం అప్పుపుట్టే పరిస్థితి లేదంటున్నారు. వడ్డీ వ్యాపారం చేసేటోళ్లు సైతం అధిక వడ్డీలకు ఆశపడి ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టడంతో సామాన్యులకు కనీసం అప్పు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. అప్పు దొరకక తమకున్న స్థిరాస్తులైన ప్లాట్లను, ఇళ్లను అమ్ముకుందామన్న కొనేనాథులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ దందాలపై నిఘా పెట్టి వీటిని నిర్మూలిస్తే బాగుంటుందని లేకపోతే రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖానాపూర్, కడెం ప్రాంతాల్లో జోరుగా..

ఓవైపు నిర్మల్ జిల్లాలో ఈ ఆన్‌లైన్ వ్యాపారాల నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేసినప్పటికి బిట్ కాయిన్ దందాను మాత్రం నిలువరించలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఉద్యోగులనే అరెస్టు చేశారని నిరుద్యోగులు పెట్టుబడులు పెట్టుకోవచ్చు అనే ప్రచారం ఇప్పటికి పలువురు స్టార్లు సామాన్యులను బురిడీ కొట్టించే ప్రయత్నంలో ఉన్నట్లు చెబుతున్నారు. మొదట్లో ఈ ఆన్‌లైన్ ద్వారా వచ్చే డాలర్లు రూపాయల్లోకి మార్చుకుంటే ఒక్కో డాలర్‌కు 90 రూపా యల వరకు వచ్చేదని ప్రస్తుతం బిట్ కాయిన్‌లో పెట్టుబడులు పెట్టవద్దని అటు పోలీసులు ఇటు మీడియా హెచ్చరిస్తున్న నేపథ్యంలో సదరు డాలర్ రేట్‌ను ఈ కేటుగాళ్లు 80 రూపాయలకు తగ్గించినట్లు చెబుతున్నారు. ఇటు పత్రికల వార్తలు అటు పోలీసుల హెచ్చరికలను సైతం తమకు అను కూలంగా మార్చుకుంటున్న ఈ కేటుగాళ్లు కోట్ల రూపాయలను కొల్లగొట్టా లనే తమ లక్ష్యాన్ని మాత్రం ఏదో రూపకంగా సాగిస్తూనే ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రధానంగా ఖానాపూర్, కడెం మండ లాల్లో ఈ 'కాయిన్' దందా జోరుగా సాగుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి కైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ఇందులో ప్రధాన భాగ స్వాములైన ఉద్యోగ, ఉపాధ్యాయులను, స్టార్లను అరెస్ట్ చేయాలని పలు వురు కోరుతున్నారు. సామాన్యులను మభ్యపెట్టి పెట్టించిన పెట్టుబడులను తిరిగి రికవరీ చేయాలని కోరుతున్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

- నంది రామయ్య, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

జిల్లాలో ఆన్‌లైన్ దందా పేరిట వందలసంఖ్యలో జనం మోసపోతున్నారు. కారకులను కఠినంగా శిక్షించాలి. ఇదివరకే పలుయాప్‌లు బోర్డులు తిప్పేశాయి. ప్రస్తుతం కాయిన్ దందాలలో పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులే భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించినప్పటికీ ఐదుగురి అరెస్టుతో సరిపెట్టడంతో మిగతావారు యథేచ్ఛగా దందాను కొనసాగిస్తున్నారు.





ఇటీవల కాలంలో బోర్డు తిప్పేసి మెటా ఫండ్ యాప్, వీసీఐ ఆన్‌లైన్ యాప్, పీఎస్ఏ యాప్

టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌ను కలిసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పాటిల్



టీపీసీసీ చీఫ్ .మహేష్‌గౌడ్‌తో ముథోల్ మాజీ ఎమ్మెల్యే

భైంసా, సెప్టెంబరు 11 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన బి.మహేష్‌కుమార్‌గౌడ్‌తో ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో భైంసా మున్సిపల్ మాజీ ఛైర్మెన్ ఓం ప్రకాష్‌లడ్డాతో కలిసి మాజీ ఎమ్మెల్యే పాటిల్ టీపీసీసీ చీఫ్ బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసారు. పార్టీ రథసారథిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకొని బి.మహేష్ కుమార్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే పాటిల్ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య తాజా రాజకీయ పరిస్థితులు, నియోజక వర్గ పరిధిలో పార్టీ స్థితిగతులు, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో చర్చించినట్లుగా తెలిసింది.

..సన్మానించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



సన్మానిస్తున్న నిర్మల్ నాయకులు

నిర్మల్, సెప్టెంబరు 11 : హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బుధవారం టీపీసీసీ నూతన అధ్యక్షులుగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, జిల్లా అధ్యక్షులు అనుముల భాస్కర్‌లు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

సోన్ రూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలో బుధవారం మండల బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు సాగర్ మాట్లాడుతూ... బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అపూర్వ ఆదరణ లభిస్తుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, మేకల అశోక్, నాగయ్య శ్రీనివాస్, సాయన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

బాసర, సెప్టెంబరు, 11 : బాసర మండల పీఆర్‌టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటైంది.

చారిత్రక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

కలెక్టర్ అభిలాష అభినవ్



అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 11 : జిల్లాలోని చారిత్రక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని శ్యామ్ ఘడ్, బత్తీస్‌ఘట్ కోటలను కలెక్టర్ పరిశీలించారు. చారిత్రక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. కోట పరిసరాల్లో ప్రభుత్వ భూమి, పట్టా భూముల హద్దులు గుర్తించాలన్నారు. శ్యామ్ ఘడ్ కోటలో విద్యుత్ లైట్లు ఈపాటు, బత్తీస్ ఘడ్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. హైమాస్ లైట్లు ఏర్పాటు చేసిన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, రోడ్లు, భవనాల శాఖ ఈఈ అశోక్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ రాజు, ఇంజనీర్ సంతోష్ జాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల విముక్తి కేంద్రం ప్రారంభం



విముక్తి కేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్

జిల్లా కేంద్ర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం మత్తు పదార్థాల విముక్తి కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గంజాయి, మత్తు పదార్థాలకు బానిసైన వారిని విముక్తి కేంద్రంలో చేర్పించినట్లయితే వాటి వినియోగానికి పూర్తిగా దూరం చేయవచ్చునని అన్నారు. ఆరు పడకలతో ఈ కేంద్రం ఏర్పాటు చేశామని నిపుణులైన వైద్యబృందం నిరంతరం పర్యవేక్షిస్తూ అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలైనట్టయితే విముక్తి కేంద్రంలో చేర్పించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో వాహనాల నిలుపుదలకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇన్‌చార్జి వైద్యాధికారి రాజేందర్, పర్యవేక్షకుడు డాక్టర్ సునీల్‌కుమార్, వైద్యులు సురేష్, సమత, పవన్, అరుణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రాణాలు కాపాడిన ఆర్‌టీసీ సిబ్బందికి ఎండీ సన్మానం

భైంసా, సెప్టెంబరు 11 : బస్సులో గుండె నొప్పి బారిన పడి ప్రాణపాయ స్థితికి చేరుకున్న ఓ విద్యార్థికి సకాలంలో వైద్య సాయం అందించి ప్రాణాలు కాపాడిన భైంసా బస్సు డిపో సిబ్బందిని ఆర్‌టీసీ యాజమాన్యం అభినందించింది. బుధవారం హైదరాబాద్‌లోని బస్సు భవన్‌లో విద్యార్థి ప్రాణాలు కాపాడిన భైంసా బస్సు డిపో కండక్టర్ జి.గంగాధర్, డ్రైవర్ బి. గంగాధర్‌లను టీజీఎస్ ఆర్‌టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉన్నతాధికారులతో కలిసి సన్మానించి , నగదు బహుమతి, జ్ఞాపికలను అందచేశారు. ఈ నెల 9న భైంసా డిపో బస్సు నిర్మల్ నుంచి భైంసా వెలుతుండగా ఘటన చోటు చేసుకుంది. బస్సు దిలావార్‌పూర్ వద్దకు రాగానే అందులో ప్రయాణిస్తున్న కిరణ్ (12)అనే విద్యార్థి గుండెనొప్పి వచ్చింది. ఇది గమనించిన బస్సు కండక్టర్ జి. గంగాధర్ డ్రైవర్ బి. గంగాధర్‌కు సంబంధిత విషయాన్ని చెప్పాడు. దీంతో అప్రమత్తమై డ్రైవర్ బి. గంగాధర్ బస్సును రోడ్డు పక్కన ఆపివేసి ఇద్దరు కలిసి బాధిత విద్యార్థికి సీపీఆర్ నిర్వహించి ప్రథమ చికిత్స చేపట్టారు. అనంతరం నేరుగా బస్సును నర్సాపూర్(జి) పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి ఆసుపత్రిలో విద్యార్థి కిరణ్‌కు అవసరమైన ఇతర వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి విద్యార్థి ప్రాణాలను కాపాడిన డ్రైవర్, కండక్టర్ల సేవలను గుర్తిస్తూ బుధవారం ఆర్‌టీసీ ఎండీ సజ్జనార్ అభినందించారు. ఇద్దరు సిబ్బందిని హైదరాబాద్ బస్సు భవన్ పిలిపించి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, నగదు బహుమతిని అందించి ప్రశంసించారు. ఆపద సమయంలో ఆర్‌టీసీ సిబ్బంది సకాలంలో సరియైన రీతిలో స్పందించి బాధ్యతాయుతంగా వ్యవహరించడం అభినందించతగ్గ విషయమని కొనియాడారు. ఇందులో భైంసా బస్సు డిపో మేనేజర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.



భైంసా డిపో సిబ్బందికి జ్ఞాపికను అందజేస్తున్న ఆర్‌టీసీ ఎండీ వీసీ సజ్జనార్

కోఠి ఉమెన్స్ విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయం

- మున్సిపల్ చైర్మన్ సత్యం
- రజక సంఘం ఆధ్వర్యంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ఖానాపూర్, సెప్టెంబరు 11 : కోఠి ఉమెన్స్ విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కోఠి ఉమెన్స్ విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టడంతో పాటు ఆమె మునిమనుమరాలు శ్వేత ఐలమ్మకు మహిళా కమిషన్ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు రజక సంఘం ఆధ్వర్యంలో సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సట్ల శంకర్, కార్యదర్శి సుంకెట పోశెట్టిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, జిల్లా నాయకులు తోట సత్యం, జన్నారపు శంకర్, పరిమి సురేష్, ఉద్యోగ సంఘాల నాయకులు రాజేందర్, సాయి, శేఖర్, రాజన్న, పోశెట్టి, చంటి, నర్సయ్య, శ్యామ్, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 11 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ ఆకాంక్షించారు. బుధవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సాఫ్ట్‌బాల్ జూనియర్, సబ్ జూనియర్ ఎంపిక పోటీలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. గెలుపు ఓటములు క్రీడాకారుల్లో స్ఫూర్తి పెంచుతాయన్నారు. ఈ నెల 21 నుంచి సిరిసిల్లలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ్ పోశెట్టి, కార్యదర్శి అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగాధర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లెక్చరర్ అవార్డు గ్రహీతకు సన్మానం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 11 : రాష్ట్ర ఉత్తమ లెక్చరర్‌గా ఇటీవల అవార్డు పొందిన వెల్మల మధును బుధవారం పలువురు సన్మానించి అభినందించారు. కే.భోజన్న, శేషాద్రి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 11 : నిర్మల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 7:30 నుండి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. మరమ్మతుల కారణంగా పాత బస్టాండ్, పాత అశోక్ టాకీస్, రాయల్ బిల్డింగ్, చింతకుంట వాడ, పింజారి గుట్ట, బస్టాండ్ ప్రాంత వాసులు సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నిర్మల్, సెప్టెంబరు 11 : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. యజమాని బొబ్బిలి గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 8న మేతకు వెళ్లిన ఆవు రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతుకగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన కనిపించిందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అటువైపు మేతకు వెళ్లిన పశువు విద్యుదాఘాతంతో మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన ఆవు విలువ రూ. 60 వేలు ఉంటుందని, పశు పోషణే ప్రధాన వృత్తిగా నమ్ముకుని తన కుటుంబం జీవనం సాగిస్తుందని తెలిపాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరాడు.

13న వారసంత వేలం

ఖానాపూర్, సెప్టెంబరు 11 : మండల కేంద్రంలో ప్రతి ఆదివారం, బుధవారం నిర్వహించనున్న వారసంతను ఈ నెల 13వ తేదీన వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 2025 వరకు 7 నెలల కాలానికి గాను నిర్వహించనున్న ఈ వారసంత వేలంలో పాల్గొనేవారు కమిషనర్ పురపాలక సంఘం ఖానాపూర్ పేరిట రూ.లక్ష డీడీని తీసి నేడు సాయంత్రం లోపు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. డీడీ అందజేసిన వారికి మాత్రమే రేపు నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.